తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

# ఆక్రమణలకు నెలవుగా నెర్రికాలువ : ఉనికి కోల్పోతున్న వైనం

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త: ఒక పక్క కాలుష్యం... మరో పక్క యదేచ్ఛగా ఆక్రమణలు దీంతో సూళ్లూరుపేట ప్రాంతంలో రైతాంగ వరప్రసాదినిగా పిలవబడే నెర్రికాలువ క్రమేపి తన ఉనికిని కోల్పోతుంది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో సుమారు అనది కారికంగా 27 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రధాన కాల్వ ప్రస్తుతం ధీనస్థితిలో ఉంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించిన మురుగునీరు మొత్తం ఈ కాల్వలోకి వదిలిపెట్టడంతో ఈ కాలువ పూర్తిగా కలుషితమైంది. ఈ విషయమై నాలుగు నెలల క్రితంనెర్రి కాలువ దిగువ ప్రాంత రైతులు మురుగునీరుతో తమ పంట పొలాలు



ముప్పుకు గురవుతున్నాయంటూ మురుగు నీరు రాకుండా వాటంబేడుకు వెళ్లే మార్గంలోని లాకుల వద్ద మట్టి పోసి అడ్డుకున్నారు. ఈ విషయమై రెండు నెలల పాటు రైతులు తమ నిరసన తెలిపారు. తరువాత తెలుగుగంగా నీరు రావడంతో లాకుల వద్దనున్న మట్టిని తొలగించారు. ప్రస్తుతం యధావిధిగా సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని మురుగునీరు మొత్తం ఈ కాల్వలోకి వదిలిపెడుతున్నారు. నెర్రి కాలువ కట్టపైనే ఆక్రమణలు 90వ దశకం నుంచి నెర్రి కాలువకట్టపై ఆక్రమణలు మెల్లమెల్లగా ప్రారంభమయ్యాయి. అప్పట్లో అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం వందల సంఖ్యలో ఇల్లు పెద్ద పెద్ద భవనాలుఈ కట్టపైన నిర్మాణం జరుపుకున్నాయి. నూతనంగా కూడా నిర్మాణాలుఈ కట్టపై జరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సూళ్లూరుపేట పట్టణంలోకి నెర్రి కాలువ చిన్న సత్రం ప్రాంతం నుంచి శ్రీ చెంగాళమ్మ దేవస్థానం సమీపంలో వాటంబేడు వెళ్లే మార్గం వరకు కొనసాగుతుంది. చిన్నసత్రం ప్రాంతం నుంచి అయ్యప్ప దేవస్థానం వెనుక వరకు యదేచ్ఛగా ఈ ఆక్రమణలు చోటుచేసుకుని ఉన్నాయి. బఫర్ జోన్‌ను సైతం లెక్క చేయకుండా ఈ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఈ కాలువకు ఇరువైపులా రివిట్మెంట్ చేసి ఆధునికరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. టెండర్లు వేసి కొంత మేర పనులు కూడా చేశారు తర్వాత ఏమైందో గానీ ఈ పనులు ముందుకు సాగక మూల పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు ప్రేక్షక పాత్రతో నెర్రికాల్వమీద ఆధారపడి సాగు చేసుకునే రైతులకు కష్టాలు తప్పేటట్లు లేదు.

# మళ్ళీ బర్డ్‌ఫ్లూ కలకలం!

**- జిల్లాలో పశుసంవర్ధకశాఖ అప్రమత్తం**



చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: జిల్లాలో మరోసారి బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. అనంతపురం జిల్లాలో కోళ్ళకు బర్డ్‌ఫ్లూ వైరస్(ఏవిఎన్ ఇన్‌ఫ్లూయెంజా- హెచ్5ఎన్1) వ్యాధి నిర్ధారణ కావడంతో జిల్లాలోని కోళ్ళకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకకుండా జిల్లా పశుసంవర్ధకశాఖ అప్రమత్తం అయ్యింది. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధకశాఖ జెడి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వెటర్నరీ వైద్యులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోళ్ళ ఫారాలను సందర్శించి కోళ్ళను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లాలో ఎక్కడ కోళ్ళకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకలేదని, ఎక్కడా కోళ్ళు అసాధారణంగా మృతి చెందలేదని నిర్ధారించారు. ఈ క్రమంలో జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ కోళ్ళకు సోకకుండా వుండటానికి పక్కా చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధకశాఖ జెడి ఉమామహేశ్వరీ పేర్కొన్నారు. కోళ్ళ పెంపకందారులు అప్రమత్తంగా వుంటూ బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్ళకు సోకకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి చిత్తూరు జిల్లాకు కోళ్ళు రవాణా అవుతుండటంతో ఈ విషయంపై చెక్‌పోస్టుల సిబ్బందిని పశుసంవర్ధశాఖ అప్రమత్తం చేసిందని వెల్లడించారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కోడి గుడ్లు, మాంసం వినియోగంపై ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దని ఆమె స్పష్టం చేశారు. కోడి మాంసం, గుడ్లు పూర్తిగా వుడికించి తగిన జాగ్రత్తలతో వినియోగించాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో కోళ్ళలో అసాధారణ మార్పులు, మరణాలు గమనించినట్లైతే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సత్వరం స్థానిక పశుసంవర్ధకశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని ఆమె కోరారు. ఇలా చేయడంతో బర్డ్‌ఫ్లూ వ్యాధి కట్టడికి వేగంగా చర్యలు తీసుకునే అవకాశం వుంటుందని ఆమె తెలిపారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి నివారణ చర్యలు, ఇతర వివరాల కోసం స్థానిక పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులను సంప్రదించాలని జెడి ఉమామహేశ్వరీ తెలిపారు.

## చిత్తూరు మేయర్ అభ్యర్థి...

# తెరపై జనసేన!

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: చిత్తూరు మేయర్ స్థానం కోసం ఇప్పటి వరకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు దిమ్మ తిరిగేలా ఆ పార్టీ అధిష్టానం వ్యవహరిస్తోంది. చిత్తూరు మేయర్ స్థానంను కూటమి పార్టీల పొత్తులో భాగంగా జనసేన పార్టీకి ఖరారు కానుందని విస్తృతంగా ప్రచారం జరుగుతుండటంతో మేయర్ కుర్చీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు చుక్కలు కన్పిస్తున్నాయి. నిన్నటి వరకు చిత్తూరు మేయర్ స్థానం తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని భావించిన ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మేయర్ కుర్చీపై ఆశలు పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి పెద్ద ఎత్తున క్షేత్ర స్థాయిలో ప్రచారంకు దిగారు. అయితే గత రెండు రోజులుగా చిత్తూరు మేయర్ స్థానం పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించిందని ప్రచారం జరుగుతుండటంతో ఇప్పటి వరకు మేయర్ కుర్చీపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ నాయకుల్లో నిరాశ నెలకొంది. మున్సిపల్ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం ముహుర్తం నిర్ణయించనుందని తెలియడంతో మేయర్ కుర్చీపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ మేరకు మేయర్ అభ్యర్థిగా పార్టీ తరపున పోటీ చేయడానికి పార్టీ అధిష్టానంతో తమకు వున్న మార్గాల ద్వారా తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో ఒక సారి మేయర్ కుర్చీ బిసీ మహిళకు కేటాయించగా మరొకసారి ఎస్సీ జనరల్ అభ్యర్థికి కేటాయించడం జరిగింది. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో మేయర్ కుర్చీకి ప్రత్యక్ష ఎన్నికలు జరుగనున్నప్పటికి ఈ సారి ఎస్సీ మహిళ లేదా జనరల్, జనరల్ మహిళ, బిసీ జనరల్‌కు మేయర్ కుర్చీ రిజర్వ్ కానుంది. ఇప్పటి వరకు మేయర్ కుర్చీ జనరల్‌కు కేటాయిస్తే తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలవడానికి కాజూరు బాలాజీ, ఎల్‌బిఐ లోకేష్‌రెడ్డిలు ప్రయత్నిస్తుండగా, ఓసి మహిళలకు రిజర్వ్ అయితే మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యాబాబు, బిసీ జనరల్‌కు కేటాయిస్తే రావూరి ఈశ్వర్‌రావు, ఎస్సీ మహిళలకు కేటాయిస్తే మాజీ మేయర్ అముదలు పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చిత్తూరు మేయర్ స్థానంను కూటమి పార్టీల పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించనున్నారని రెండు రోజులుగా విస్తృతంగా ప్రచారం జరుగుతుండటంతో ఆ పార్టీకి చెందిన నాయకులు మేయర్ కుర్చీ కోసం ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. చిత్తూరు నుండి జనసేన పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి దివంగత మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య లలితాంబికకు పార్టీ అధిష్టానం నుండి హామీ లభించిందని ప్రచారం జరుగుతుంది. ఈమె కూటమి నాయకులతో కలిసి త్వరలో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి సిద్ధమవుతున్నారని పార్టీలో ప్రచారం జరుగుతుంది. అలాగే జనసేన పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు సోదరుడి కుమారుడు జెఎంసి శివకుమార్ సైతం సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం అవుతుంది. అలాగే జనసేన పార్టీకి చిత్తూరు సమన్వయకర్తగా వున్న అరణి కవిత సైతం మేయర్ అభ్యర్థిగా బరిలో వున్నారు. ఈమెను పార్టీ అధిష్టానం పిలిచి ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆర్థిక వనరులను సిద్ధం చేసుకోవాలని చెప్పినట్లు సమాచారం. అలాగే జనసేన నుండి యువనేత యశ్వంత్ సైతం మేయర్‌గా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి ప్రజారాజ్యం పార్టీ పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవడంతో చిత్తూరులో బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలో నిలిపితే మేయర్ ఎన్నికల్లో గెలుపు సులభమని భావించి జనసేన సైతం ఆ సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లను మాత్రం మేయర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చిత్తూరు మేయర్ స్థానం కూటమి పార్టీల్లో పెద్ద భాగస్వామ్య పార్టీగా వున్న తెలుగుదేశం పార్టీకి వరిస్తుందా! లేక జనసేన పార్టీకి వరిస్తుందా! అనే విషయం త్వరలో తేలనుంది.

**-ఏడు టన్నుల కాపర్ వైర్, మినీ లారీ లారీ స్వాధీనం**

**-మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు**

# అంతర్రాష్ట్ర దొంగల ఆటకట్టు

రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త: బెంగళూరు నుంచి శ్రీసిటీకి తరలించాల్సిన రూ.1.20 కోట్ల విలువైన ఏడు టన్నుల కాపర్ వైర్ చోరీ కేసును రేణిగుంట అర్బన్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, చోరీకి గురైన కాపర్ వైర్‌తో పాటు మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న దృశ్యం

తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ ఎస్. జయచంద్ర, పోలీసు సిబ్బంది పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన మినీ లారీ యజమాని, డ్రైవర్ వినోద్ కుమార్ తన లారీ (టీఎన్ 23 డీసీ 4177)లో సెప్టెంబరు 16న బెంగళూరులోని వేదాంత లిమిటెడ్-స్టార్‌లైట్ కాపర్ కంపెనీ నుంచి ఏడు టన్నుల కాపర్ వైర్‌ను శ్రీసిటీకి తరలించేందుకు లోడ్ చేసుకున్నాడు. అయితే, సరుకును గమ్యస్థానానికి చేర్చకుండా స్నేహితులు ఆర్. రాజా, కె. నవీన్ కుమార్, దినేష్‌లతో కలిసి చోరీకి పథకం వేశారు. సెప్టెంబరు 17న వేలూరు సమీపంలోని చెరువు వద్ద జేసీబీతో గుంత తవ్వించి కాపర్ వైర్‌ను పాతిపెట్టారు. అనంతరం మినీ లారీని రేణిగుంటలోని రమణ విలాస్ సర్కిల్ సమీపంలో జామ్ జామ్ హోటల్ పక్కనున్న పార్కింగ్‌లో వదిలి పరారయ్యారు. చోరీ చేసిన సరుకును విక్రయించేందుకు కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో, లారీని తిరిగి తీసుకెళ్లేందుకు శుక్రవారం పార్కింగ్ వద్దకు వచ్చిన ఆర్. రాజా, కె. నవీన్ కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు వేలూరు జిల్లా కాట్పాడి మండలానికి చెందిన ఆర్. రాజా (35), కె. నవీన్ కుమార్ (39) లను అదుపులోకి తీసుకున్నారు.ప్రధాన నిందితుడు, లారీ యజమాని, డ్రైవర్ వినోద్ కుమార్‌తో పాటు దినేష్ పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.పోలీసులు రూ.1.20 కోట్ల విలువైన ఏడు టన్నుల కాపర్ వైర్‌తో పాటు చోరీకి ఉపయోగించిన టీఎన్ 23 డీసీ 4177 నంబరు మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన మురళి, రమేష్, రాజశేఖర్, శ్రీను, గౌరి నాయుడు, బాదుర్షా, చలపతిలను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.చోరీలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో తెలిపారు.

## 2047 నాటికి 50 శాతం

# గ్రీన్ కవర్ లక్ష్యం

**జిల్లాలో అటవీ ప్రాంతాలతో పాటు, అటవీ ప్రాంతాల వెలుపల కూడా వృక్ష సంపదను వృద్ధి చేస్తాం.**

**-జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**



సమావేశంలో మాట్లాడుతున్న జెసి గోవిందరావు

తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 9 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించి, 2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించే దిశగా జిల్లా గ్రీనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఏపీ గ్రీన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం-2001 ప్రకారం సంస్థ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నందు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అటవీశాఖ సోషల్ ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర సంబందిత శాఖల అధికారులతో కలసి జిల్లాలో పచ్చదనం పెంపుదల లక్ష్యంగా జిల్లా హరితాభివృద్ధి సంస్థ తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతాల వెలుపల కూడా వృక్ష సంపదను విస్తరించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, భారీ స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, వ్యవసాయ ఆధారిత అటవీ పెంపకం, గృహ ఆవరణలు, సంస్థాగత ప్రాంగణాలు, పారిశ్రామిక ప్రాంతాలు, రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్లు, గ్రామీణ ప్రాంతాల్లో భారీ వృక్షారోపణ కార్యక్రమాలను ప్రోత్సహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్ళురుపేట డీఎఫ్ఓ శ్రీనివాస్ రెడ్డి, డిడిడిఐసి జవహర్ బాబు, డిప్యూటీ సిఈఓ వెంకటనారాయణ, డిపిఓ సుశీలా దేవి, సిపిఓ రాజశేఖర్, తిరుపతి డిడిఓ గంగాభవాని, శ్రీకాళహస్తి డిడిఓ సుస్మిత, సూళ్లూరుపేట డిపిఓ రెడ్డెప్ప, హార్టికల్చర్ అధికారి శివకుమారి, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజానాయక్, వ్యవసాయ అధికారి ప్రసాద రావు, డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ ఈ, తదితర కమిటీ సభ్యులు ఇతర ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టు...నిలుపుకుంటారా!

**-తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి పరువు పోరాటమేనా!?**

ప్రభాతవార్త-తిరుపతి:

ఆధ్యాత్మిక, రాజకీయ కేంద్రమైన తిరుపతిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు పరువు కోసం తపించే పరిస్థితి కనిపిస్తోంది. 2024 ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో చిత్తూరునుండి వచ్చిన వైసిపి నేత శ్రీనివాసులుకు మనసు చంపుకుని ఓట్లు వేశామని టిడిపి కార్యకర్తలు ఇప్పుడు ఆవేదన వెలిబుస్తున్నారు. ఆయన గెలిచిన తర్వాత టిడిపి కార్యకర్తలను పట్టించుకోవడం లేదని కొందరు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇదీ ఇప్పుడు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తిరుపతి మేయర్ స్థానాన్ని కూడా జనసేనకు కేటాయిస్తారన్న ప్రచారం టిడిపి శ్రేణుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. కేవలం ఒక సామాజిక వర్గం ఓట్ల కోసం 43 ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీ కార్యకర్తలను విస్మరించడం భావ్యం కాదని వారు అంటున్నారు. ఇప్పటికే తిరుపతి టిడిపిలో మూడు వర్గాలుగా విభేదాలు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో, మేయర్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేతులు ఎత్తేస్తే అది వైసిపికి సానుకూలమేనని ఒక సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించడం విశేషం.

**-ఐదు మేయర్ స్థానాలపై జనసేన పట్టు?:**

రాష్ట్రంలో 17 మేయర్ స్థానాల్లో కూటమిలోని జనసేన ఐదు స్థానాలు,బిజెపి ఒక స్థానం కోరుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనసేన పార్టీ కాకినాడ, ఏలూరు, విజయవాడ, మచిలీపట్నం, తిరుపతి స్థానాల కోసం పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇక చిత్తూరు జిల్లా జనసేన నేతలు కూడా తిరుపతి మేయర్ స్థానంపై పవన్ కల్యాణ్‌పై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే టిడిపి ఎమ్మెల్యేలు ఉన్న కాకినాడ, ఏలూరు, మచిలీపట్నం స్థానాలను జనసేనకు ఇచ్చేందుకు టిడిపి ప్రాథమికంగా సమ్మతి తెలిపినట్లు సమాచారం. జనసేన మరింత పట్టుబడితే ఒంగోలు, విజయవాడ, చిత్తూరులో ఒక స్థానాన్ని కేటాయించే అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది. అయితే తిరుపతి మేయర్ స్థానాన్ని జనసేనకు ఇప్పిస్తానని పవన్ కల్యాణ్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులకు హామీ ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారం టిడిపి నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. అదే జరిగితే వైసిపి అభ్యర్థికి పరోక్షంగా దోహదపడినట్లేనని కొందరు టిడిపి నాయకులు ఘంటా పథంగా చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వర్గం, నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ వర్గం నువ్వా నేనా అన్నట్టుగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అనగాని వర్గంలో మాజీ కార్పొరేటర్, రాష్ట్ర కార్యదర్శి అన్నా అనితా యాదవ్, మరికొందరు నాయకులు ఉన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్ జెబి శ్రీనివాస్‌కు మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ప్రధాన కార్యదర్శి, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులు ఈ వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకురాలేక ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్‌రెడ్డి గత ఏడాది కాలంగా టీవీ డిబేట్లకే పరిమితమయ్యారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మాజీ కార్యనిర్వహక కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి, కార్యదర్శి సూరా సుధాకర్ రెడ్డి తదితరులు కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.ఈ పరిస్థితుల్లో మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించి, ఆపై మళ్లీ దిగుమతి అభ్యర్థికి మేయర్ టికెట్ ఇస్తే గెలుపు మరింత కష్టమవుతుందని టీడిపి శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, మాజీ తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పుష్పావతి యాదవ్, బుల్లెట్ రమణ,కొందరు యువతనాయకులు తదితరులు అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో తిరుపతి మేయర్ స్థానాన్ని టిడిపికి కేటాయించి, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చి గెలిపించడం ద్వారా తిరుపతిలో పార్టీ పరువు కాపాడాలని టిడిపి కార్యకర్తలు అధినేత నారా చంద్రబాబు నాయుడు,లోకేశ్‌లను కోరుతున్నట్లు సమాచారం. తిరుపతిలో టిడిపి పరువు నిలవాలంటే మేయర్ పీఠం ఎవరికి దక్కాలి? అన్నదే ఇప్పుడు కూటమి రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# స్థానిక ఎన్నికలకు జనసేన అడ్‌హాక్ కమిటీ

**-ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో ఏర్పాటు**



తిరుపతి విద్య, అక్టోబర్ 9 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే దిశగా జనసేన పార్టీ తిరుపతి పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీని ప్రకటించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ప్రధాన కమిటీని పార్టీ అధిష్టానం శుక్రవారం ఏర్పాటు చేసింది. ఇందులో తమ్మినేని వెంకటేశ్వర్లు, సుభాషిణి, మిద్దెల హరి, కిరణ్ రాయల్ సభ్యులుగా ఉన్నారు.ప్రధాన కమిటీకి సహకరించేందుకు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సభ్యులతో నిర్వాహక్ దళ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 32 మందికి ఇందులో చోటు కల్పించారు. వీరికి తోడుగా ఐదుగురితో ప్రత్యేక సహాయక బృందాన్ని కూడా నియమించారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని సేకరించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ఉండనుంది. పార్టీ సంస్థాగత బలం, నాయకులు, జనసైనికుల పనితీరు, స్థానిక రాజకీయ పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలను కమిటీ పరిశీలించనుంది. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలతో ఎమ్మెల్యే నేతృత్వంలోని అడ్‌హాక్ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కేంద్ర కమిటీకి నివేదికలు అందజేయనుంది. ఈ నివేదికలను జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా పరిశీలించి తదుపరి కార్యాచరణపై ఆదేశాలు ఇవ్వనున్నారు. త్వరలో ఆయన అడ్‌హాక్ కమిటీతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.

# ఆర్డీఓ కార్యాలయానికి ఎంఎల్ఏ పరుగు

**- నాడు తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్... నేడు ఆర్‌డిఓ కార్యాలయాల్లో ప్రత్యక్షం**



ఆర్డీఓ కార్యాలయంలో సామాన్యుడు సీటులో కూర్చోని మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి లోని కీలకమైన ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగటం లేదనే అసంతృప్తితో ప్రజల నుంచి మళ్ళీ మళ్ళీ వస్తున్న వినతుల పరిష్కారానికి సాక్షాత్తు శాసనసభ్యుడే విసిగి వేసారి ప్రభుత్వ కార్యాలయాల గడప తొక్కుతున్నారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన అస్తవ్యస్తమైంది. గతంలో ఓ రైతుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కోసం తిప్పలు పెడుతుండగా ఆ కార్యాలయానికి వెళ్ళిన ఎంఎల్ఏ శుక్రవారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయానికి బాధితునితో రావటం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్ఏ అధికారులను తిప్పుకోవద్దంటూ సూచిస్తున్నా పనులు కాకపోవటంతో ఆయనే స్వయంగా రాకతప్పటం లేదు.

**బోనుపల్లి రైతు కోసం :**

తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామానికి చెందిన రైతు బత్తెయ్య రెండేళ్ళుగా ఎంఎల్ఏ వద్దకు తన భూ సమస్య కోసం రావటం ఆయన రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేయటంతో సరిపెడుతూ వచ్చారు.శుక్రవారం సహనం కోల్పోయిన ఎమ్మెల్యే బాధిత రైతుతో పాటు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి న్యాయం చేయాలని కోరడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మండలం బోనుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతు చిట్టత్తూరు బత్తయ్యకు చెందిన ఒకటిన్నర ఎకరా విలువైన భూమిని గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాయకులు కబ్జా చేశారు. తన భూమిని తిరిగి ఇప్పించాలని రెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు అధికారుల చుట్టూ,కాళ్లు అరిగేలా తిరిగినా కనికరించలేదు.

**కూటమి వచ్చినప్పటి నుంచి:**

వైకాపా ఆగడాలకు బలి అయిన పేద రైతు బత్తెయ్య కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎంఎల్ఏను సంప్రదించి, తన గోడును విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, శుక్రవారం తన కార్యక్రమాలను పక్కనపెట్టి సరాసరి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. బాధితుడి పరిస్థితిని, గత వైకాపా నాయకులు చేసిన అరాచకాలను ఆర్డీవోకు వివరించి, తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో భూ కబ్జాలు, దౌర్జన్యాలు సర్వసాధారణ మయ్యాయి. బోనుపల్లి రైతు బత్తయ్య విషయంలో అదే జరిగిందన్నారు. రెండేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న ఆ రైతుకు మా కూటమి ప్రభుత్వంలో తప్పక న్యాయం జరుగుతుందని నెల రోజుల్లో ఆయన భూమిని ఆయనకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్వయంగా తన కోసం రావడంతో బాధిత రైతు చిట్టత్తూరు బత్తయ్య కంటతడి పెట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు తొట్టంబేడు మండలం అధ్యక్షులు రావిళ్ళ ముని రాజనాయుడు, విజయ్ కుమార్ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, పవన్, షాకిర్ అలీ షఫీ,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా వాహిని బహుమతుల ప్రదానోత్సవం.



చిట్వేలి,అక్టోబర్ 9 ప్రభాతవార్త: చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యా వాహిని' కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. హెచ్ఎం దుర్గరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ధార్మిక, జగదీష్, రాజేష్, సుస్మిత, శ్రీరామ్, వైష్ణవి, లావణ్య, హరి శ్రీనివాసులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సోఫియా, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్, స్కౌట్ మాస్టర్, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన



రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ సేవా సమితి (రాస్), కోకా కోలా ఫౌండేషన్ సహకారంతో, జిల్లా విద్యాశాఖ సమన్వయం ద్వారా శుక్రవారం విద్యార్థులకు నీరు, పారిశుద్ధం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా చేతుల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు, అంటువ్యాధుల నివారణపై విద్యార్థులకు వివరించడంతో పాటు, స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.రాస్ ఆధ్వర్యంలో తిరుపతి అర్బన్, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని ఎంపిక చేసిన పాఠశాలల్లో నీరు, పారిశుద్ధం, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూడా ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా రాస్ సంస్థ డైరెక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, సామాజిక అభివృద్ధిలో భాగంగా తమ సంస్థ వివిధ సంక్షేమ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాస్ సిబ్బంది కలిసి తారకరామా నగర్ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది ధనకుమార్, చంద్రశేఖర్, శైలజ, భారతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, అల్తాఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ద్వారా కుటుంబాలు, సమాజంలోనూ పరిశుభ్రమైన అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## నిందితుడికి 7 రోజుల జైలు శిక్ష



రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో రేణిగుంట మండలం వేణుగోపాలపురానికి చెందిన వై.దాము (35)కు తిరుపతిలోని ప్రత్యేక న్యాయస్థానం ఏడు రోజుల సాధారణ కారాగార శిక్షతో పాటు పది వేల జరిమానా విధించింది. తాగి వాహనం నడిపిన కేసులో నిందితుడు శుక్రవారం న్యాయస్థానానికి హాజరై తన నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది.మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185(బి) కింద నిందితుడిని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం, అక్టోబరు 9 నుంచి 15వ తేదీ వరకు జైలు శిక్ష విధించింది.

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు



రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త:స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతిభద్రతలను పరిరక్షి ంచేందుకు పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రేణిగుంట పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను అధికారులు సంయుక్తంగా సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో రవిచంద్ర, అర్బన్ సీఐ జయచంద్ర పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను సమీక్షి ంచారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సులభంగా చేరుకునేందుకు మార్గాల అనుకూలతపై పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ భద్రతా బాధ్యతలు చేపట్టడంతో పాటు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షి ంచనున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షి స్తూ అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.

## పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన : డీఈ

సత్యవేడు, అక్టోబరు 9 ప్రభాతవార్త: గృహస్థుల విద్యుత్ బిల్లులను తగ్గించడంతో పాటు సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తిరుపతి జిల్లా నాగలాపురం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మదనంబేడు ఎస్ఎస్వీ కల్యాణ మండపంలో సేవాసేతు అభియాన్, సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై విద్యుత్‌శాఖ ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో గృహవి ద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఈ పథకంలో వినియోగదారులు వారి ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యు త్ గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇందులో ఒక కిలో వాట్ సామర్థ్యానికి 30 వేలు, రెండు కిలో వాట్‌కి 60 వేలు, మూడు కిలో వాట్‌కి 78 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. సొంత విద్యుత్ ఉత్పత్తి ద్వారా పగటి సమయంలో ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్ వంటి పరికరాల అవసరంలో కొంత, ఎక్కువ భాగాన్ని సోలార్ ద్వారా తీర్చుకోవచ్చన్నారు. తద్వారా పర్యావరణ కూడా ఎలాంటి ముప్పు ఉండదన్నారు. ఇప్పటి వరకు నాగలాపురం విద్యుత్ శాఖ సెక్షన్ పరిధి పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, శ్రీసిటీ, వరదయ్యపాళెంమండలాలకు సంబంధించి గృహ వినియోగదారులకు 218 మంది సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో విద్యుత్ శాఖ సిబ్బంది చంద్రబాబు, మురగయ్య, శేఖర్, వినోద్, నరేంద్ర, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవీనవరాత్రి మహోత్సవాలు : ఎంఎల్‌ఏ



చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో ఈ నెల 11 నుండి 20 వరకు దేవీనవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలలో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్యంపై అప్రమత్తంగా వుండాలన్నారు. వాహన సేవల్లో భక్తులు ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దాతల సహకారంపై ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డికి సూచనలు చేశారు.

## శ్రీకామాక్షి అమ్మవారి ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



రామచంద్రాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త: రాయలచెరువు కట్టక్రింద వెలసియున్న శ్రీకామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల గోడపత్రికలను శుక్రవారం ఎంఎల్ఏ పులివర్తి నాని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అతి ప్రాచీన ఆలయమైన శ్రీకామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి వారి ఆలయంలో 9 రోజులు నవరాత్రి ఉత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్మవారిని 9 రోజులు వివిధ రూపాలలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారన్నారు. 20వ తారీఖున విజయదశమిని పురస్కరించుకుని జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తానికొండ కేశవులు నాయుడు, కొట్టే నరశింహారెడ్డి, తంజావూరు వంశీ, ఉమాపతి నాయుడు, త్యాగరాజులు రాయల్, మల్లిరెడ్డి, భూపతి రెడ్డి, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవ మంచినీటి సమస్య పరిష్కారం

**విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కారానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ చూపించినందుకు ఆ గ్రామస్తులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో రోజులుగా ఇళ్ళత్తూరు దళితవాడ ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతుండేవారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశించడంతో ఇళ్ళత్తూరు గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య తీరింది.

## నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (శీశి)2026లో భాగంగా నిర్వహించిన ఎన్యుమరేషన్ దశలో, 2026 జూన్ 15వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు నిర్వహిం చిన ఇంటింటి సర్వే సందర్భంగా మరణం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదవడం, ఆచూకీ లభించకపోవడం తదితర కారణాల వల్ల మొత్తం 90922 మంది ఓటర్లు తమ చిరునామాల్లో అందుబాటులో లేనట్లు గుర్తించామని వారి కొరకు మరోమారు శనివారం నుండి నాలుగు ఐదు రోజులు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్ళి పునఃపరిశీలన చేయడం జరుగుతుందని 167 తిరుపతి అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ల నమోదు అధికారి, కమిషనర్ ఎం.జయకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.ఎల్.ఓల ద్వారా నిర్వహించిన ఇంటింటి ఎన్యుమరేషన్ అనంతరం మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన ఓటర్లు మరియు బహుళ నమోదులను తొలగించి, 31.07.2026న ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురించామని తెలిపారు. ఈ ముసాయిదా జాబితాలో మొత్తం 204406 మంది ఓటర్లు ఉన్నారు. 16.10.2026న ప్రచురించనున్న తుది ఓటరు జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వ్యక్తులు, అలాగే తదుపరి అర్హత తేదీల నాటికి ఓటరుగా అర్హత పొందిన వారు నిరంతర నవీకరణ ప్రక్రియలో ఫారం6 సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని 167 తిరుపతి అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ల నమోదు అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ వేడుకలు



నారాయణవనం, అక్టోబర్ 9 ప్రభాతవార్త : నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు వెంకటశివకుమార్, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపటి నుంచి అవనాక్షమ్మ అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాలు



నారాయణవనం, అక్టోబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం అవనాక్షమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుంచి 20వతేది వరకు శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు వెంకటశివకుమార్, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్‌లు తెలిపారు. ఈ ఉత్సవాలు పదిరోజుల పాటు జరుగుతుందన్నారు.

## క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే

**కేవీబీపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మండలంలోని వగత్తూరు పంచాయతీ వగత్తూరు గ్రామంలో శుక్రవారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యకర్త పాలమంగళం రమేష్ జన్మదినం సందర్భంగా భారీ కేక్‌కట్ చేసి క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ఈ టోర్నీని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బ్యాటింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో యువతులు కలిగి యువ శక్తిగా దేశానికి ఉపయోగపడాలని శక్తితోనే గ్రామాలు పురోభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం బ్యాటింగ్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.కార్యక్రమంలో అవసరం సురేష్‌రెడ్డి, జంగారెడ్డి, శివరావు, గోపినాథ్‌రెడ్డి, కందస్వామి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మనీ, బాలాజీ, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

**కేవీబీపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని 39 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో బి.వి.మాలతి, ఎస్ఐ ఓబయ్య పరిశీలించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు, ఓటర్లరాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను కూడా సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



కేవీబీపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త: స్థానిక ఎన్నికలపై కలెక్టర్ వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ స్పందనారెడ్డి, ఎంపీడీవో మాలతి, ఎస్ఐ ఓబయ్య, ఈవోపీఆర్‌డీ కాణాక్షిరెడ్డి, తదితర అధికారులు హాజరయ్యారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పలు సూచనలు చేశారు.

## పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఎలాంటి లొసుగులు కూడా లేకుండా భూ యజమానులకు పారదర్శకంగా పట్టాదారు పాసు పుస్తకాలు కూటమి ప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా పుత్తూరు మండలంలోని సిరుగురాజు పాళెం పంచాయతీలో శుక్రవారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు తమ భూములపై పూర్తి స్థాయిలో హక్కు కల్పిస్తూ పాసు పుస్తకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పద్మశాల అధ్యక్షుడు గంజిమాధవయ్య, తహసీల్దార్, ఎంపీడీవో, తడుకు సింగిల్‌విండో అధ్యక్షుడు కరుణ, టీడీపీ నాయకులు రమేష్, రవి, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య పాఠశాలలో దసరా వేడుకలు

*పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:* పుత్తూరులోని స్వామివీధిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు సంబరాలు అంబరాన్ని తాకింది. విద్యార్థిని, విద్యార్థులు అమ్మవార్ల వేషధారణ ప్రత్యేకతను చాటి చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీల్లో భక్తి పాటలతో నృత్యం చేసి విద్యార్థులు అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## నైతిక విలువలు పెంపొందించుకోవాలి : ఎస్ఐ

**విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఎస్ఐ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శాంతి భద్రతలు విద్యార్థుల పాత్ర అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే సత్ప్రవర్తన కలిగి ఉండాలని, చెడు అలవాట్లకుదరంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యా యుడు వెంకమరాజు మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులు బావులు, చెరువులు, గుంటలు వద్దకు వెళ్ళకూడదని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురలక్ష్మి, సురేష్, సుబ్రహ్మణ్యం, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలి



**విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా మండలంలోని రైతులు ఆరుతడిపంటల సాగుపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారిణి రజనికుమారి పేర్కొన్నారు. మండలంలోని పన్నూరు రైతు సేవా కేంద్రంలో 80 శాతం రాయితీతో ప్రభుత్వం అందించిన మినుములు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినోప్రభావం వల్ల నీటిసమస్య తీవ్రంగా ఉంటుందని ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బాబు, టీడీపీ నాయకులు సుధా నాయుడు, బెంజిమెన్, పాల్ సుకీర్త రాజ్, సచివాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవ మంచినీటి సమస్య పరిష్కారం

విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త: మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కారానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ చూపించినందుకు ఆ గ్రామస్తులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో రోజులుగా ఇళ్ళత్తూరు దళితవాడ ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతుండేవారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశించడంతో ఇళ్ళత్తూరు గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య తీరింది.

# తిరుపతి డివిజన్

## స్థానిక సమరంలో తగ్గేదేలే! : హర్షిత్‌రెడ్డి



**తిరుపతి రూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమర శంఖం పూరించాలని ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి పంచాయతీలో పార్టీ అభ్యర్థులు పోటీ చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా అన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధం కావాలని సూచించారు. టీడీపీ రాజకీయ వ్యూహాలను ఐక్యతతో ఎదుర్కొంటూ విజయమే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతి రూరల్ మండలంలోని కుంట్లపాకం, తణపల్లి, కేసీపేట, దుర్గసముద్రం, చిగురువాడ, మల్లంగుంట, రామానుజపల్లి, సి.గొల్లపల్లి, పైడిపల్లి, పాతకాల్వ పంచాయతీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించారు. కుంట్లపాకంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కీలకమని పేర్కొన్న హర్షిత్‌రెడ్డి, ప్రతి స్థానానికి సమర్థులైన అభ్యర్థులను గుర్తించాలని సూచించారు. ఒక్కో స్థానానికి నలుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పోటీకి ఆసక్తి చూపుతున్న వారంతా నామినేషన్ పత్రాలకు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు. పార్టీ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు వివిధ రాజకీయ వ్యూహాలు అనుసరించే అవకాశం ఉందని హర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే విజయాలు పార్టీకి క్షేత్రస్థాయిలో మరింత బలాన్ని చేకూరుస్తాయని హర్షిత్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయా పంచాయతీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయన పర్యటనతో స్థానిక ఎన్నికలపై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మూలం చంద్రమోహన్‌రెడ్డి, విడుదల మాధవరెడ్డి, చిన్నియాదవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయతీ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధనలక్ష్మి నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం!

-14 పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని



**తిరుపతి రూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలోని ధనలక్ష్మి నగర్‌లో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీబీ రామ్ జీ పథకం కింద సుమారు రూ.69 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 14 అభివృద్ధి పనులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ధనలక్ష్మి నగర్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు గాంధీ పురం టిడిపి అధ్యక్షుడు ధన రాయల్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. చేపట్టనున్న 14 పనులు పూర్తయితే స్థానికంగా మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పాటు లభించనుంది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే పులివర్తి నాని, గ్రామంలో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

**రొంపిచర్ల అక్టోబర్ 9 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పండ్ల రసాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పాలు, కోడిగుడ్లు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అమ్మాణ్ణి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దసరా వేడుకల్లో శ్రీ చైతన్య విద్యార్థుల సందడి



**తిరుపతి విద్య, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగను శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ జి.ఎస్. మాడా బ్రాంచ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన వేడుకలతో సందడి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా దసరా పండుగ ప్రాముఖ్యతను, భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిలో దానికి ఉన్న ప్రత్యేక స్థానాన్ని విద్యార్థులకు వివరించారు. చెడుపై మంచి, అన్యాయంపై ధర్మం సాధించిన విజయానికి దసరా ప్రతీకగా నిలుస్తుందని తెలియజేశారు. పండుగల వెనుక ఉన్న అంతరార్థాన్ని తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, ప్రైమరీ ఇన్‌చార్జి అర్చన, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి నందన, ప్రైమరీ కోఆర్డినేటర్ సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అందరి భాగస్వామ్యంతో వేడుకలు ఉత్సాహభరితంగా ముగిశాయి.

కెనరా బ్యాంక్ Canara Bank

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ఫోన్ : 79016 26759, 9491061630

**స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 28.10.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది: 28.10.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు**
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 27.10.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీత(లు): 1. శ్రీ రావు నతీష్ కుమార్, తండ్రి: ఆర్. నరశేఖర్‌రాజు, డి.నెం. 10/413, క్రాంతినగర్, రాజీవ్ నగర్, తిరుపతి-517501. 2. శ్రీమతి ఆర్. రంగనాయకులమ్మ, భర్త: ఆర్. నరశేఖర్‌రాజు, డి.నెం. 10/413, క్రాంతినగర్, రాజీవ్ నగర్, తిరుపతి-517501. 3. శ్రీ ఆర్. కిరణ్ కుమార్, తండ్రి: ఆర్. నరశేఖర్‌రాజు, డి.నెం. 10/413, క్రాంతినగర్, రాజీవ్ నగర్, తిరుపతి-517501 మరియు హామీదారు : శ్రీ కె. లోకనాథం, తండ్రి: కె. రఘునాథ్, డి.నెం. 10-437, వెంకటేశ్వర కాలనీ, జీవకోన, తిరుపతి-517501. బకాయి మొత్తం : తేది.30.09.2026 నాటికి రూ.84,20,722.81 + తేది.01.10.2026 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

తిరుపతి జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, రేణిగుంట సబ్-జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, నెం.8, మంగళం గ్రూపు, మంగళం గ్రామ అకౌంట్స్, (ఉప్పరపాలెం దగ్గర), సర్కార్ డ్రై, ఎస్.నెం.97/7లో ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: సర్వే నెం. 97/3లో భూమి, ఉత్తరం: ఎస్. నారాయణ నాయుడు స్థలం, దక్షిణం: లక్ష్మి నారాయణ టవర్స్. కొలతలు: తూర్పు నుండి పడమర : 65 అ॥ లేదా 19.825 మీ॥, ఉత్తరం నుండి దక్షిణం: 98 అ॥ లేదా 29.890 మీ॥, మొత్తం 6370 చ॥అ॥ లేదా 707.77 చ॥గ॥ స్థలం. "ఎ" షెడ్యూల్ ఆస్తిలో 1/21వ అవిభాజ్యపు అనుపాతపు వాటా 33.70 చ॥గ॥ స్థలం.

పైన తెలిపిన ఎస్.నెం.97/7, ఎ-షెడ్యూల్ ఆస్తి సందు అనిర్దేశపు వాటా కలిగి శ్రీమన్నారాయణ టవర్స్, 5వ అంతస్తులో సూపర్ బిల్టప్ ఏరియా 1504 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), అన్ని అపార్టినెన్సెస్, ఈజ్‌మెంటరీ హక్కులు మరియు కారుపార్కింగ్ ఏరియా కలిగి అసంపూర్తి నిర్మాణంలోనున్న రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.503. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఓపెన్ వరండా, దక్షిణం: శూన్యాకాశం. సెమీ-ఫినిష్డ్ దశలో ఉన్న ఫ్లాట్

**రిజర్వు ధర: రూ. 14,50,000/-** **ధరావత్తు సొమ్ము: రూ. 1,45,000/-**

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 79016 26759, 9491061630.
* బిడ్డర్లు తమ ఆఫర్‌లను ఆస్తి రిజర్వు ధర ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 08.10.2026, ప్రదేశం : తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

